క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం గుత్ప గ్రామానికి చెందిన చిన్నారి శివాన్షి కటుంబ సభ్యులకు కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి మంగళవారం పెర్కిట్‌లో రూ.లక్షా 50 వేల ఎల్‌వోసీని అందజేశారు. చిన్నారి శివాన్షి అనారోగ్యంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో జాయిన్ చేశారు. దీంతో వినయ్ రెడ్డి చికిత్సలకు అయ్యే వ్యయాలను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరు చేయించారు. ఈ మేరకు ఎల్‌వోసీని శివాన్షి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ పట్టణంతో పాటు మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, పెర్కిట్ గ్రామాల్లో మంగళవారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఘన వ్యర్థాల నిర్వహణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రాజు పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, వార్డు ఆఫీసర్లు ప్రవళిక, ప్రజ్ఞాన్, రవి, నర్సయ్య పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న భవనాలకు నోటీసులు

ఆర్మూర్‌టౌన్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి నోటీసులు ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. పట్టణంలోని 34వ వార్డులో శిథిలావస్థలో ఉన్న భవనంపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో భవనాన్ని కమిషనర్ పరిశీలించారు. ఇంటి యజమానికి నోటీసులు ఇచ్చి రెండు రోజుల్లో కూల్చి వేసుకోవాలని సూచించారు. టీపీవో అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

గుండ్ల చెరువు మినీ ట్యాంక్ బండ్ పనుల పరిశీలన



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని గుండ్ల చెరువు మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులను మంగళవారం పబ్లిక్ హెల్త్ ఈఈ తిరుపతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.4 కోట్ల నిధులతో మినీ ట్యాంక్ బండ్ పనులు చేపడుతున్నామన్నారు. నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మున్సిపల్ కమిషనర్ రాజు, కాంట్రాక్టర్ చందు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బాల్కొండ: ముప్కాల్ మండలం నల్లూర్‌లో లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు శ్రీనివాస్, ప్రవీణ్, ఫణిందర్, రాజేశ్వర్, క్రాంతి కుమార్, రణధీర్, తదితరులు పాల్గొన్నారు.

కిసాన్‌నగర్‌లో..

బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో నలుగురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. డీసీసీ డెలిగేట్ కపిల్, నాయకులు రాజలింగం, గంగాధర్, చాట్ల నరేశ్, రవీందర్, గోపిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్మూర్ ఎస్సైగా తిరుపతి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్సైగా సీహెచ్ తిరుపతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వేకెన్సీ రిజర్వ్(వీఆర్)లో తిరుపతి ఆర్మూర్‌కు బదిలీపై వచ్చి ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు.

బడి బాట పరిశీలన



రుద్రూర్: కోటగిరి, పొతంగల్ మండలాల్లో కొనసాగుతున్న బడి బాట కార్యక్రమాన్ని విద్యాశాఖ జిల్లాస్థాయి అధికారులు మంగళవారం పరిశీలించారు. ఏఎంవో బజరంగ్ బాలకృష్ణ, సీఎంవో శ్రీనివాస్ స్థానిక ఎంఈవోలతో కల్సి వివిధ గ్రామాల్లో పర్యటించారు. పిల్లల తల్లిదండ్రుల సమావేశాల్లో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాల గురించి వివరించారు. కోటగిరి హైస్కూల్‌ను సందర్శించి కంప్యూటర్ ల్యాబ్, బుక్ బ్యాంకు నిర్వహణ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవోలు లోల శంకర్, శ్రీనివాస్ రావ్ ఉన్నారు.



వీరన్నగుట్టలో ఇంటిపై విరిగి పడిన విద్యుత్ స్తంభం



దండిగుట్ట శివారులో రోడ్డుపై కూలిన చెట్టు



బోర్గాం(కె) శివారులో రోడ్డుకు అడ్డంగా..

గాలివాన బీభత్సం

- కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- పలుచోట్ల దెబ్బతిన్న వాహనాలు



నవీపేట-జానకంపేట రహదారిపై కూలిన చెట్లను జేసీబీతో తొలగిస్తున్న పోలీసులు

బోధన్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలో సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులతో కూడిన వర్షం ధాటికి పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. చెట్లు విరిగి రోడ్లపై అడ్డంగా పడ్డాయి. దీంతో చాలా చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయమేర్పడింది. చెట్లు విరిగి కొన్ని చోట్ల పార్కింగ్ చేసిన వాహనాల మీద పడటంతో అవి ధ్వంసమయ్యాయి. విద్యుత్ తీగలు తెగిపోవడంతో కరెంటు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. మంగళవారం సాయంత్రం వరకు కూడా ట్రాన్స్ కో అధికారులు, సిబ్బంది రాకపోవడంతో కొన్నిచోట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు త్వరగా స్పందించి కరెంటును పునరుద్ధరించాలని కోరుతున్నారు. – సాక్షి నెట్‌వర్క్



గొట్టిముక్కలలో తీగలను సరిచేస్తున్న విద్యుత్ సిబ్బంది



ముప్కాల్ మండలం కొత్తపల్లిలో.. నేలకొరిగిన మారేడు చెట్టు



నల్లూర్ శివారులో పెద్దవాగు రోడ్డుపై..



పెర్కిట్‌లో ..



గాదేపల్లిలో స్కూటీపై విరిగి పడ్డ చెట్టు



డొంకేశ్వర్: పడిపోయిన కరెంట్ స్తంభం

దివ్యాంగులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- దివ్యాంగుల సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్

ఆర్మూర్‌టౌన్: జిల్లాలో వికలాంగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, 50 శాతం రిజర్వేషన్ ఉన్నా సరైన పత్రాలు లేవని, దీంతో ఉపాధి అవకాశాలు లేక తీవ్రంగా బాధపడుతున్నారని, ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని స్నేహ వైకల్య వెల్పేర్ సొసైటీ దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ ప్రెస్ భవన్లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 16న ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్(ఆర్మూర్) ఆవరణలో జరగబోయే రాష్ట్ర స్థాయి సమ్మేళనానికి జిల్లా స్థాయిలో ముందస్తు సన్నాహక సమావేశాలు చేపట్టామన్నారు. దివ్యాంగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా ఈ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్

సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం

- ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్

డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ భవనంలో 'రెవెన్యూ సదస్సు'ను నిర్వహించగా, ఆర్డీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు ఇచ్చిన భూ సమస్యల దరఖాస్తులను పరిశీలించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, సమస్యలను త్వరగా పరిష్కరించడానికి కృషి చేయాలని తహసీల్దార్ నరేశ్‌కు సూచించారు. రెవెన్యూ సదస్సులతో రైతులకు నమ్మకం కలిగించాలన్నారు.



సదస్సులో పాల్గొన్న ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్

వేతనాలు చెల్లించాలని ఆందోళన

నవీపేట: నవీపేట మేజర్ జీపీ పరిధిలోని కార్మికులకు బకాయి వేతనాలను చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. కోటి రూపాయల ఆదాయం వస్తున్నా జీతాలు సకాలంలో ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో డీపీవోకు విన్నవించగా వెంటనే చెల్లించాలని ఆదేశించారని, కానీ ఇంత వరకు చెల్లించలేదని మండిపడ్డారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీవో రామకృష్ణకు అందజేశారు. జీపీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు జంగల్ గంగాధర్, మండల నాయకులు ఆంజనేయులు, బద్దం పోశెట్టి, రాధ తదితరులు పాల్గొన్నారు.



నవీపేటలో ఆందోళన చేస్తున్న జీపీ కార్మికులు

డ్యాంపై తాగితేనే గమ్మత్తా !



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆనకట్ట మందు బాబులకు అడ్డాగా మారింది. దీంతో డ్యాంపై తాగితేనే 'గమ్మత్తు' అన్నట్లుగా యువకులు మద్యం సీసాలు తెచ్చుకుంటున్నారు. మంగళవారం చల్లటి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండటంతో ప్రాజెక్ట్ సందర్శనకు యువకులు పోటెత్తారు. చాలా మంది యువకులు బీరు సీసాలు తెచ్చుకొని, ప్రాజెక్ట్ లోపలికి దిగి నీటి అంచున సేవించారు. ఇలా నిత్యం అనేక మంది మద్యం సేవిస్తున్నారు. మందు బాబులను ప్రాజెక్ట్ అధికారులు, పోలీసులు ఎవరూ కట్టడి చేయడం లేదు. వీరి వల్ల పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సోలార్ ఫెన్సింగ్ నిర్మాణానికి భూమిపూజ



బాల్కొండ: ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోలార్ ఫెన్సింగ్ నిర్మాణానికి బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకుడు సంతోష్ మంగళవారం భూమి పూజ నిర్వహించారు. నాయకుడి సంతోష్ ఫౌండేషన్ ద్వారా రూ.లక్షా 8 వేల అంచనా వ్యయంతో పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పాఠశాలలో కోతుల వల్ల తీవ్ర ఇబ్బంది అవుతుందని దృష్టికి రావడంతో పనులను చేపట్టినట్లు తెలిపారు. వీడీసీ అధ్యక్షుడు రమేశ్, కార్యదర్శి నేర నర్సయ్య, ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి కార్యాలయాలపై దాడి అమానుషం



బోధన్ పట్టణంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు



డొంకేశ్వర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం

సాక్షినెట్‌వర్క్ : 'సాక్షి' కార్యాలయాలపై అకారణంగా టీడీపీ గూండాలు దాడులకు పాల్పడటాన్ని, ప్రముఖ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ బోధన్, బాన్సువాడ, బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల పరిధిలో మంగళవారం సాక్షి సిబ్బందితో పాటు వివిధ జర్నలిస్టు సంఘాలు, వామపక్ష నేతలు, ప్రజా సంఘాల నాయకులు ఆందోళనలు నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ తప్పిదాలను సాక్షి మీడియా ప్రశ్నిస్తున్నదన్న ఒక్క కారణంతోనే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కక్ష గట్టారని విమర్శించారు. ఇది ముమ్మాటికీ పత్రికా స్వేచ్ఛపై దాడేనని వ్యాఖ్యానించారు. టీడీపీ రౌడీ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముక్త కంఠంతో కోరారు. పలు చోట్ల అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. కొన్నిచోట్ల అంబేడ్కర్ విగ్రహాలకు వినతి పత్రాలిచ్చారు.



కమ్మర్‌పల్లి తహసీల్ వద్ద ..



బాల్కొండలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం



వేల్పూర్ తహసీల్ ఎదుట ఆందోళన



రెంజల్ తహసీల్ వద్ద సీపీఐఎంఎల్ ప్రజాపంథా ప్రతినిధులు



ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయం ఏవో వెంకటేశంకు వినతి పత్రం



రుద్రూర్ చౌరస్తాలో..



నందిపేట తహసీల్‌లో వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



మాక్లూర్‌లో..



నవీపేటలో రెవెన్యూ అధికారికి వినతి పత్రం



మోర్తాడ్ తహసీల్దార్‌కు వినతిపత్రం

నేటి చిత్రం



ప్రమాదకరంగా మూల మలుపు

రెంజల్: రెంజల్–సాటాపూర్ గ్రామాల మధ్యన గల లింకు రోడ్డుపై మూలమలుపు ప్రమాదకరంగా మారింది. ఆయా గ్రామాల రైతులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ దారిలో వెళ్తుంటారు. రోడ్డు మధ్యలో మూల మలుపు వద్ద ఇరువైపులా రోడ్డు కోతకు గురికావడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలి. – గోపాల్ రెడ్డి, రెంజల్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలిచి పార్టీ సత్తా చాటాలని బీజేపీ మండల ఇన్‌చార్జి గంగోని సంతోష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ 11 సంవత్సరాల పాలన గురించి ప్రజలకు తెలియజెప్పాలన్నారు. గ్రామాల్లోని కార్యకర్తలు పార్టీ కోసం కష్టపడి పని చేయాలని, అలాంటి వారికి తగిన గుర్తింపు తప్పక లభిస్తుందన్నారు. బీజేపీ మండల అధ్యక్షులు మగ్గిడి చిన్నారెడ్డి, సీనియర్ నాయకులు ఆరే గంగాధర్, సంజీవ్, సురేందర్, ముత్యం, సాగర్, మహేశ్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంగోని సంతోష్

యూరియా వాడకాన్ని తగ్గించాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): పంటలు సాగు చేసే రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలని రుద్రూర్ శాస్త్రవేత్తలు దినేష్, శ్రీలత సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. యూరియాను అధికంగా వినియోగించడం వల్ల పురుగులు, తెగుళ్ల ఉధృతి పెరగడమే కాకుండా పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని తెలిపారు. తెగుళ్ల నివారణకు వేసవిలో లోతు దుక్కులు దున్నాలని, విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. అలాగే వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రణాళికతో పంట మార్పిడి చేస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. ఏవో మధుసూదన్, సొసైటీ చైర్మన్ భరత్ రాజ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూమేశ్ రెడ్డి, ఏఈవోలు మౌనిక, ప్రశాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రుద్రూర్ శాస్త్రవేత్త దినేష్

పోర్టల్‌లో నమోదు చేయాలి



పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్: స్వీకరిస్తున్న దరఖాస్తులను పరిశీలించి కేటగిరీల వారీగా భూభారతి పోర్టల్‌లో పారదర్శకంగా నమోదు చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో తహసీల్దార్లకు సూచించారు. మంగళవారం పెంటాకలాన్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు విచ్చేసి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించారు. రెవెన్యూ ఉద్యోగులకు సూచనలు చేశారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ విఠల్ ఉన్నారు.

జాక్కంపేటలో రెవెన్యూ సదస్సు

ఎడపల్లి మండలం జాక్కంపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ దత్తాద్రి, మండల నాయబ్ తహసీల్దార్ అనూష దరఖాస్తులను స్వీకరించారు. 115 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించండి



పోస్టర్లను ప్రదర్శిస్తున్న తహసీల్దార్ విఠల్

బోధన్: ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని బోధన్ తహసీల్దార్ విఠల్ సూచించారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల మౌలిక సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. మంగళవారం పెంటాకలాన్ జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. పాఠశాల హెచ్ఎం అబ్బయ్య, జీపీ కార్యదర్శి విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌పీవో విచారణ

బాల్కొండ: మండల కేంద్రంలో నర్సింగ్ రావుకు చెందిన ఇంటి స్థలాన్ని అదే గ్రామానికి చెందిన రవి కిరణ్ తన భార్య పేరున అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించాడని ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో మంగళవారం డీఎల్‌పీవో శివకృష్ణ విచారణ చేపట్టారు. విచారణలో స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు గుర్తించారు. వెంటనే రిజిస్ట్రేషన్ రద్దు చేసుకోవాలని సూచించారు. లేదంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జీపీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్‌ను త్వరగా పునరుద్ధరించాలి

వర్ని: నిన్న రాత్రి ఈదురు గాలులతో స్తంభించిపోయిన విద్యుత్‌ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ వర్ని మండల కేంద్రంలో గ్రామస్తులు మంగళవారం రాత్రి రాస్తారోకో నిర్వహించారు. విద్యుత్ లేక 24 గంటలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. పక్క గ్రామం నుంచి మండల కేంద్రానికి విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

నర్సరీల పరిశీలన

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్, చేపూర్‌లలో నర్సరీలను ఎంపీడీవో బ్రహ్మానందం మంగళవారం పరిశీలించారు. నర్సరీలలో ఎన్ని మొక్కలు ఉన్నాయి, ఎలా సంరక్షిస్తున్నారనే విషయాలను స్థానిక కార్యదర్శులను, ఈజీఎస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే సుర్బిర్యాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కూడా పరిశీలించారు.